



'జగన్'ను నమ్మినందుకు.. మోకాళ్ల 'శిక్ష'



- మూడో రోజూ ఉధృతంగా సమ్మె
- కేంద్రాలు తెరిచేందుకు ప్రభుత్వ యత్నం
- 'ఎరుపెక్కిన' అంగన్‌వాడీల 'శిబిరాలు'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'తెలంగాణా కంటే అదనంగా వేతనం ఇస్తామని ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. నాలుగున్నరేళ్లయినా స్పందన లేదు.. నమ్మినందుకు మోసపోయాం.. తెలంగాణాలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల హామీల్లో భాగంగా 11వేల నుంచి 18వేల వరకు జీతాలు పెంచాలని చూస్తోంది.. ఇక్కడేమో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సమ్మెచేస్తుంటే వాలంటీర్ల ద్వారా అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించాలని ప్రభుత్వం చూస్తోంది.. ఏదిఏమైనా సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నెరవేర్చే వరకూ సమ్మె ఆపేది లేదు' అంటూ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ధ్వజమెత్తారు. సమ్మె మూడో రోజు గురువారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎర్రచీరలతో నిరసన తెలపడంతో శిబిరాలన్నీ ఎర్రబారాయి. జగన్‌ను నమ్మినందుకు మాకు శిక్ష తప్పదంటూ మోకాళ్లపై నిరసన తెలిపారు. బలవంతంగా సెంటర్లు నిర్వహించాలని చూస్తే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన సెలవులు ప్రకటించాలని, నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలని, వయోపరిమితి పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె మూడో రోజూ కొనసాగింది. ఎపిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, ఐఎన్‌టియుసి గౌరవాధ్యక్షులు నవీన్‌కుమార్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. తెలంగాణాల్లో ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీని అక్కడి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. సెంటర్ల తాళాలను పగలగొట్టి వాలంటీర్ల ద్వారా నడిపించాలన్న ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమన్నారు. యుటిఎఫ్ జిల్లా నాయకురాలు ఎ.పద్మజ సంఘీభావం ప్రకటించారు.

కెవిబిపురంలో.. టిడిపి నాయకులు డి.ఇలంగోవన్‌రెడ్డి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ మహిళలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వాళ్లకంట కన్నీరు పెట్టించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో.. గత 15ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల్లో జ్ఞానాన్ని వెలికితీస్తున్న పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం దారుణమన్నారు. నాలుగు మండలాల అంగన్‌వాడీ సమస్యను డాక్టర్ హెలెన్ ఆధ్వర్యంలో అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని మండల నాయకులు తెలిపారు. శుక్రవారం తనవంతుగా అంగన్‌వాడీ అక్కచెల్లెళ్లు 300 మందికి అన్నదానం చేపడతానని హామీ ఇచ్చారు.

గూడూరుటౌన్‌లో.. మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు రైతుసంఘం నాయకులు జోగి శివకుమార్, ఎ.ఇంద్రావతి, బివి రమణయ్య, ఎస్.సురేష్, ఎ.ప్రసాద్, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్యలు సంఘీభావం ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీల అడ్వకేట్ మందా మనోహర్, అడ్వకేట్ భావన, కార్మిక సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, సేలం శేఖరాచారి మద్దతు తెలిపారు.

శ్రీకాళహస్తిలో... మోకాళ్లపై వినూత్న నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు సిఐటియు డివిజన్ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, రాపూరు సుబ్రమణ్యం సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ నాయకులు రేవతి, పుష్ప, సౌజన్య, భారతి పాల్గొన్నారు.

రేణిగుంటలో.. పాత ఎంఆర్ఒ ఆఫీసు వద్ద అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మద్దతు తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మల సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చే బాధ్యత తమదన్నారు. టిడిపి మండలాధ్యక్షులు మునిచంద్రరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి కె.హరినాథ్, అధ్యక్షులు నరసింహారెడ్డి, సిపిఎం నాయకులు ఒ.వెంకటరమణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, మహిళా మండలి అధ్యక్షురాలు పూమణి, సంఘమిత్ర కార్యదర్శి లక్ష్మి, ఐద్వా నాయకులు సత్యశ్రీ సంఘీభావం తెలిపారు. కార్యకర్తలు పాండురంగమ్మ, భాగ్యలక్ష్మి, లావణ్య, రాజేశ్వరి, కోకిల, వనజ, పవిత్ర, విమలమ్మ, వసంత, నిర్మల, పుష్ప, ఖాదర్ బి పాల్గొన్నారు.


చంద్రగిరిలో..

నాయుడుపేటలో ...ఎర్రచీరలతో ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అణచివేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. తమ ఎర్రచీరలు ప్రభుత్వానికి రెడ్‌లైట్ అని అన్నారు. విజయమ్మ, సుకుమారి పాల్గొన్నారు. సూళ్లూరుపేట, కోటల్లోనూ సమ్మె కొనసాగింది.

చంద్రగిరిలో..అనివార్య పరిస్థితుల్లో అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, తాళాలు పగలగొట్టాలని చూస్తే ప్రతిఘటిస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. వీరికి సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర, బాలాజీ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి హరిక్రిష్ణ, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.వాణీశ్రీ పాల్గొని ప్రసంగించారు. టిడిపి నాయకులు పులివర్తినాని సతీమణి సంఘీభావం ప్రకటించారు. ప్రేమ నాగరాజమ్మ, నాగభూషణమ్మ, లీల పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... సిఐటియు నాయకులు ఆర్.వెంకటేష్, ఎఐటియుసి నాయకులు డి.మహేష్ ఆధ్వర్యంలో నల్లచీరలతో మోకాళ్లపై నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షురాలు విజయ కుమారి, ముని కుమారి, హైమావతి, ధనమ్మ, రాధా, అన్నపూర్ణమ్మ, అంబిక, గంగులమ్మ, పద్మజ పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి లేదు

- ఏం మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతాం
- అధికారులను నిలదీసిన వైసిపి కార్పొరేటర్లు
- టిడిఆర్ బాండ్ల అవినీతిపై కౌన్సిల్లో చర్చ
- ఎలుకల నిర్మూలనకు చర్యలు తీసుకోండి
- రూ.346.46 కోట్ల అంచనాలతో బడ్జెట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.. మా వార్డుల్లో పనులు జరగడం లేదు.. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చేస్తాం..చూస్తాం అని చెబుతున్నారు. కార్పొరేటర్‌గా గెలిచి మూడేళ్లయ్యింది. తొలి కౌన్సిల్లో చెప్పిన సమస్యలే ఇంతవరకూ పరిష్కారం కాలేదు.. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో చెప్పిన సమస్యలూ ఎప్పటిలానే ఉన్నాయి. ఏం మొహం పెట్టుకుని ఓటర్ల దగ్గరకు వెళ్లాలి' అంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు గురువారం జరిగిన కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. తిరుపతి ఎస్‌వి సెనెట్ హాల్లో వార్షిక బడ్జెట్ ఆమోదం, సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం అతిథులుగా పాల్గొన్నారు. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ జరిగింది. అధికార పార్టీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, రోడ్లు మౌలిక వసతుల కల్పన సమస్యలు పరిష్కరించకపోతే అధికారులు ఎందుకని ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతామన్నారు.

టిడిఆర్ బాండ్ల అవినీతిపై వాడివేడిగా చర్చ

నెల్లూరుకు చెందిన టిడిపి నేత ఆనం రామ్మోహన్ రెడ్డి తిరుపతిలో జరిగిన టిడిఆర్ బాండ్ల పంపిణీలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన నేపథ్యంలో కౌన్సిల్లో వాడివేడిగా చర్చ నడిచింది. అధికార పార్టీ కార్పొరేటర్ నరసింహాచారి, వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు ఇమాం సాహెబ్ మాట్లాడుతూ తిరుపతిలో ట్రాఫిక్ సమస్య నివారణ కోసం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రతిపాదిస్తే 14 రోడ్లు పూర్తి చేశారని, ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గిందని భూములు కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. నెల్లూరుకు చెందిన టిడిపి నేత టిడిఆర్ బాండ్ల అవినీతిపై చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి జరగలేదని టిడిపి కార్పొరేటర్ ఆర్ సీ మునికష్ణ ఎందుకు ఖండించలేకపోయారని నిలదీశారు. అరగంట సేపు వాదోపవాదాలు చేసుకోవడంతో కౌన్సిల్లో గందరగోళం నెలకొంది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇరువురికీ సర్దిచెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి అవినీతి జరగలేదని వివరణ ఇచ్చారు.

ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టండి : సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

తిరుపతిలో ఎలుకల సమస్య ఎక్కువ ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలుకల వల్ల తన కారు పాడైపోయిందని గుర్తు చేశారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బ తినడానికి కారణం కూడా ఎలుకలేనని పేర్కొన్నారు. కోఆప్షన్ సభ్యులు ఇమాం సాహెబ్ మాట్లాడుతూ పాముల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ ఏడాది వార్షిక బడ్జెట్ 346.46 కోట్లు

తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఎఎస్ కౌన్సిల్ తీర్మానాలను వివరిస్తూ 2024-25 వార్షిక ఏడాదికి సంబంధించి 346.46 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్ ను, అదేవిధంగా 2023-24 వార్షిక ఏడాదికి సవరించిన బడ్జెట్ ను ఆమోదించినట్లు తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ నందుగల గార్బేజ్ కలెక్షన్ వాహనాలకు రూట్ ఆప్టిమైజేషన్ సర్వీస్ చేయుటకు గాను మెజర్స్ రూట్ బ్లూ వారికి 59 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. తెలుగు గంగ పంప్ హౌస్ లలో అత్యవసరమగు మెటీరియల్స్ కొత్త మోటార్లు, పంప్ లు, సాఫ్ట్ స్టార్టర్ ల రిపేర్లు, కొత్త ట్రాన్స్ ఫార్మర్ ను, అల్యూమినియం కేబుల్స్ కొనుగోలు చేయుటకు 1 కోటి 99 లక్షలు కేటాయించారు. 1557 మంది ఔట్సోర్సింగ్ సిబ్బందికి 2024-25 సంవత్సరానికి ఆప్కాస్ ద్వారా రూ.34,60,17,696 చెల్లించుటకు పరిపాలన మంజూరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీధి కుక్కలను పట్టి శస్త్ర చికిత్సలు చేసి, కుక్కలకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేయుటకు ఒకొక్క కుక్కకు 1200 రూపాయాలు చొప్పున అనిమల్ కేర్ ల్యాండ్ వారికి మరో ఆరు నెలలు ఇచ్చేలా ఆమోదం తెలిపారు.



తుపాను బాధిత ప్రాంతాల్లో కేంద్రబృందం పర్యటన

ప్రజాశక్తి - తడ

ఈనెల మొదటివారంలో వచ్చిన తుపాను నష్టాన్ని కేంద్ర బృందం పరిశీలించింది. మండలంలోని కాదలూరు, కొండూరు గ్రామాల్లో పర్యటించారు. కాదలూరు చెరువుకు పడిన గండిని, పులివేంద్ర గ్రామం వద్ద ఇసుక మేటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర కరువు బృందం సభ్యులు మీనాహుడా, రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, విద్యుత్ మౌలిక సదుపాయాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేశామన్నారు. పూర్తి నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ కేంద్రకమిటీ సభ్యులు విపత్తుల వల్ల కలిగిన నష్టాన్ని అవగాహన చేసుకుని నివేదిక అందజేయాలని, ఎక్కువ నిధులు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీరివెంట సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, వ్యవసాయ శాఖ డిఎఒ ప్రసాద్, తడ తహశీల్దార్ కటారి జయజయరావు, ఎడిఎ అనిత ఉన్నారు.

19న చలో నెల్లూరు

తిరుపతి సిటి : ఈనెల 19న నెల్లూరులో జరగనున్న 'జయ్‌హో 2వ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి' అని జాతీయ అధ్యక్షులు విజయ శంకరస్వామి పిలుపునిచ్చారు. తిరుపతి గాంధీ విగ్రహం వద్ద గురువారం జాతీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న ప్రతినిధులతో ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేస్తూ, మతోన్మాదాన్ని నిర్మూలించేందుకు జాతీయ స్థాయిలో నిర్మాణమవుతున్న మహోద్యమం ఈ జయ్‌హో అని అన్నారు. షాజహాన్ మాట్లాడుతూ హిందూ ముస్లింలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ అధ్యక్షులు లోకనాథం, ఉపాధ్యక్షులు వంశీ, కార్యకర్తలు శ్యాంసుందర్, రజిని, మహేష్, రాబర్ట్, నారాయణ పాల్గొన్నారు.

18న సంకల్ప యాత్రకు గవర్నర్ రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విశ్వ భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేది తిరుపతిలో జరిగే కార్యక్రమానికి విచ్చేస్తున్న రాష్ట్ర గవర్నర్ ఏర్పాట్లపై తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సమీక్షించారు. కమిషనర్ చాంబర్లో జరిగిన సమీక్షా సమావేశంలో కమిషనర్ హరిత మాట్లాడుతూ ఈ నెల 18వ తేది మహిళా యూనివర్సిటీ వేదికగా జరుగు కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొంట్టున్నారని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మెప్మా రాధమ్మ, డి.ఆర్.డి.ఏ జ్యోతి, డి.ఎస్.ఓ రఘువీర్, తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భావి తరాల కోసం విద్యుత్తును ఆదా చేయాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఇంధన పొదుపు ర్యాలీని గురువారం ఉదయం సిఎండి సంతోష రావు ప్రారంభించారు. ఎపిఎస్పిడిసిఎల్ తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు కొనసాగిన ర్యాలీని ఉద్దేశించి సిఎండి సంతోష రావు మాట్లాడుతూ అత్యంత విలువైన విద్యుత్తును వధా కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. విద్యుత్తును ఆదా చేయడం ద్వారా విద్యుత్తు బిల్లు మొత్తం కూడా తగ్గుతుందనే అంశాన్ని వినియోగదారులు గ్రహించాలన్నారు. సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బులను వినియోగించడం ద్వారా సుమారు 60 శాతం విద్యుత్తు ఆదా అవుతుందని తెలిపారు. అంతేకాకుండా 3 లేదా అంతకంటే ఎక్కువ స్టార్ రేటెడ్ గృహోపకరణాలను



వినియోగించడం ద్వారా సుమారు 30 శాతం విద్యుత్తును ఆదా చేయవచ్చని వివరించారు. గీజర్ల స్థానంలో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్తును ఆదా చేయవచ్చని సూచించారు. స్వచ్ఛమైన గాలి, వెలుతురుకు ప్రాధాన్యతనివ్వాలని, అవసరం లేని సందర్భాల్లో ఎసిని ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్తును ఆదా చేయడంతోపాటు బిల్లును కూడా గణనీయంగా తగ్గించుకునేందుకు అవకాశం వుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ పి. అయూబ్ ఖాన్, జనరల్ మేనేజర్ రామచంద్ర రావు, తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. కష్ణా రెడ్డి పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీ స్కాంతో జాగ్రత్త : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



క్రిప్టో కరెన్సీ స్కామ్స్ చేసే సైబర్ నేరగాళ్లు సృష్టించిన ఫేక్ మొబైల్ యాప్‌లను డౌన్లోడ్ చేస్తే సదరు మొబైల్ తమ ప్రమేయం లేకుండా వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందని, అటువంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి పి.పరమేశ్వర్‌రెడ్డి హితవు పలికారు. సైబర్ నేరగాళ్లు పంపే నకిలీ వెబ్‌సైట్ లింకులు చూడటానికి సమాజంలో ప్రముఖ కంపెనీల లోగోలు, పేర్లు మాదిరిగానే ఉంటాయన్నారు. ఒక్క అక్షరం తప్పుగా లేదా స్పెల్లింగ్‌లో అక్షరాల క్రమం తా ం ు వ ా ం ు గా ఉంటుందన్నారు. క్రెడిట్ కార్డు బ్లాక్ అయ్యిందని, లిమిట్ డబుల్‌చేస్తాం అని కాల్స్ వస్తాయని, వాటిని నమ్మి మోసపోరాదన్నారు. ఓటిపిలను సైబర్ నేరగాళ్లకు తెలియజేస్తే బ్యాంక్ అకౌంట్‌లోని నగదు మాయం అవుతుందన్నారు. రిమోట్ యాక్సెస్ షేరింగ్ ఆప్స్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

పిఎస్ అండ్ డిజి ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు ఆలయ మార్గంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి శ్రీనివాస హోటల్, ద్వారక గ్రాండ్ (పిఎస్ అండ్ డిజి) హోటల్స్‌ను గురువారం ప్రారంభించారు. స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని శిల్పారామం ఎదురుగా ఏర్పాటు చేసిన హోటల్స్ వద్ద మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మునిరత్నం నాయుడు మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలుగా వ్యాపార రంగంలో ఉన్న అనుభవంతో పద్మావతి అమ్మవారి దగ్గర యాత్రికుల అభిరుచులకు తగ్గట్టుగా ఆహారం అందిస్తాం అన్నారు. పూర్తి శాఖహర భోజనం, చైనిస్ఫుడ్, అన్ని రకాల ఆహార పదార్దాలు ఇక్కడ దొరుకుతాయన్నారు. శుచి, శుభ్రత, నాణ్యతలో రాజీ లేకుండా ఆహార పదార్దాలు అందిస్తాం అన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్ నాయుడు, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ సంజయ్, నరసింహాయాదవ్, దొడ్డరెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాపరెడ్డి, విజయ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ జగదీష్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



ప్రజాశక్తి - తిరుపతి సిటి

టైమ్స్ గ్రూప్ ఆర్థోపెడిక్ విభాగంలో అత్యున్నతమైన సామాజిక సేవలో భాగంగా, దివ్యాంగులైన చిన్నారులకు పునరావాసం కల్పించడంలో డాక్టర్ గుడారు జగదీష్ కు సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు అందింది. డాక్టర్ గుడారు జగదీష్ ఆర్థోపెడిక్ విభాగంలో అగ్రగామి వైద్యుడిగా ఖ్యాతి గడించారు. ఒక మారుమూల గ్రామం నుంచి డాక్టర్ అయ్యారు. 1981లో తిరుమల తిరుపతి దేవస్థానాల (తి.తి.దే.)లో సీనియర్ రెసిడెంట్‌గా తన వైద్య రంగం ప్రస్థానాన్ని ప్రారంభించారు. చివరికి ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆర్థోపెడిక్ వైద్య సంస్థ బర్డ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. తర్వాత ఆస్టర్ రమేష్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో అకడమిక్ డైరెక్టర్ గా, నెల్లూరు జిల్లా గొలగమూడి లోని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమ వైద్యశాలలో సలహాదారుగా సేవలు అందించారు. ఈ నేపథ్యంలో నిస్వార్ధ సేవలకు దేశ, విదేశాల్లో పేరెన్నికగన్న ప్రముఖ సంస్థల ద్వారా వైద్యశిరోమణి, ప్రాణదాత, ఫ్రెండ్ ఆఫ్ హ్యూమానిటీ, జీవిత సాఫల్యం అవార్డులను జగదీష్ అందుకున్నారు. తాజాగా టైమ్స్ అవార్డు కూడా ఆయన్ను వరించింది.

వరద బాధితులను తక్షణం ఆదుకోవాలి : సిపిఐ

తిరుపతి సిటి : తుఫాన్ కారణంతో నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం ఉదయం తిరుపతి జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ప్రతి రైతుకూ ఎకరాకు 30 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అకాల వర్షాలతో వరి, వేరుశనగ, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకష్ణ, గురవయ్య పాల్గొన్నారు.

మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్‌లో టెన్త్ పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి బొత్సా సత్యనారాయణ ప్రకటించారు. మార్చి 18 నుంచి పరీక్షలు జరుగుతాయని, ఏడు సబ్జెక్టులకే పరీక్షల నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 12.45 వరకూ పరీక్ష ఉంటుంది. 18న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 22న లెక్కలు, 23న ఫిజికల్ సైన్స్, 26న బయాలజీ, 27న సోషల్ స్టడీస్ ఉంటుంది. 28న మొదటి లాంగ్వేజ్ పేపర్ 2/ ఓఎస్ఎస్ఇ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 1 పరీక్ష జరుగుతుంది. 30న ఓఎస్ఎస్ఇ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2, వొకేషనల్ కోర్సు ప రీక్ష జరుగుతుంది.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




పుత్తూరు టౌన్ : ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి అక్బర్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ఈ నెల 19న ఎస్ వి యూనివర్సిటీ లో జరుగుతాయన్నారు. పుత్తూరు మండల కమిటీ గురువారం ఎంపికయ్యింది. కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల నుండి విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ దిశగా విద్య వ్యవస్థను తీసుకెళుతోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జీవో 77 తీసుకొచ్చి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. పుత్తూరు డిగ్రీ కాలేజీ ఎకనామిక్స్ అధ్యాపకులు నరసింహ మాట్లాడుతూ విద్యార్థులు ఎస్ఎఫ్ఐ లాంటి విద్యార్థి సంఘంలో పని చేయడం చాలా ముఖ్యమని, విద్యార్థి హక్కుల కోసం పోరాటం చేయాలని, విద్యార్థులు రాజకీయాల గురించి ఆలోచించాలని అన్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా చాందిని, పూర్ణ కుమార్, ఉపాధ్యక్షులు వర లక్ష్మి, లావణ్య, అభి, అక్షిత, ఉష రాణి, సహాయ కార్యదర్శులుగా వేణు గోపాల్, ఉమేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్ నాయక్, హేమంత్, రాజేష్ కుమార్, 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గణేష్, భరత్ పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొట్టేలా టిటిడి హెల్త్ టెండర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టీటీడీలో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం హెల్త్ విభాగంలో విడుదల చేసిన ఆన్లైన్ టెండర్లలో పెట్టిన నిబంధనలు మార్చాలని కోరుతూ నేడు టిటిడి పరిపాలన భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి సుబ్రమణ్యం మాట్లాడుతూ టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు 45 సంవత్సరాలు లోపు వయస్సు ఉన్న వారినే తీసుకోవాలని పెట్టిన నిబంధన వల్ల బతుకులు పోతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కొత్తగా పెట్టిన ఈ నిబంధనను తొలగించాలని, ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులను 60 సంవత్సరాలు వరకు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళలు 25శాతం, మగవారు 75శాతం ఉండే విధంగా కార్మికులను పెట్టుకోవాలని పెట్టిన నిబంధన సరైంది కాదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దని టిటిడి యాజమాన్యాన్ని కోరారు. హెల్త్ విభాగం కార్మికులకు, ఎఫ్ఎంఎస్ విభాగం కార్మికులకు పెండింగ్ బ్రహ్మోత్సవ బహుమానం వెంటనే చెల్లించాలని, లడ్డు, వడ మంజూరు చేయాలని కోరారు. పెంచిన జీతాలను క్యాటగిరి వారిగా ఇవ్వాలని అన్నారు. సులభ్ సంస్థ చెల్లించాల్సిన రెండు కోట్ల పెండింగ్ జీతాలను కార్మికులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు నగర ఉపాధ్యక్షురాలు పి బుజ్జి, కాంట్రాక్ట్ కార్మికులు రాజా, నోమేష్, శ్రీనివాసులు, రామ్మూర్తి, ధనమ్మ, సరస్వతి, గౌరీ, ధనలక్ష్మి, రఘు, ఏకాంబరం, సిద్ధా, ఆనందు, శంకరు సురేషు, సుబ్బయ్య, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



శ్రీవాణి ట్రస్టు నిధులతో 3,615 ఆలయాల నిర్మాణం

ప్రజాశక్తి - తిరుమల

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు(శ్రీవాణి) ద్వారా 3,615 ఆలయాల నిర్మాణం, పలు ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆలయాల నిర్మాణంపై ఈవో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటివరకు 1500 ఆలయాల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన ఆలయాల నిర్మాణాన్ని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులను కోరారు. రాష్ట్ర దేవాదాయ శాఖ 1973 ఆలయాలను నిర్మించిందన్నారు. సమరసత సేవ ఫౌండేషన్ 320 ఆలయాల నిర్మాణం చేపట్టి 307 ఆలయాలను పూర్తి చేసిందని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలు కమిటీలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే ఆలయాల నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. సమరసత సేవ ఫౌండేషన్‌కు మరికొన్ని ఆలయాల నిర్మాణ బాధ్యతలు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు. సమరసత సేవ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శ్రీవిష్ణు మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టు నిధులతో ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు, కొండ ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల్లో మూడు చార్టెడ్ అకౌంటెంట్ సంస్థల ద్వారా సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) చేశారని చెప్పారు. ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం శ్రీవాణి ట్రస్టు నుండి ప్రతి నెలా రూ.5 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సమీక్షలో సమరసత సేవ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి త్రినాథ్, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్ఏసిఏవో బాలాజి, సిఏవో శేషశైలేంద్ర పాల్గొన్నారు.

తిరుమలకు కాలినడకన దీపికా పదుకునే

ప్రజాశక్తి -తిరుమల తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రముఖ బాలీవుడ్ నటి దీపికా పదుకునే తిరుమలకు చేరుకున్నారు.. గురువారం రాత్రి అలిపిరి కాలిబాట మార్గం గుండా గోవింద నామ స్మరణ చేస్తూ సామాన్య భక్తులతో కలిసి ముడున్నర గంట పాటు నడుచుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.. నడక మార్గంలో నడుచుకుంటూ వస్తున్న దీపికా పదుకునేతో భక్తులు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపించారు.. అనంతరం తిరుమలలోని రాధేయం అతిథి గహం చేరుకున్న దీపికా పదుకుణే, తిరుమలలో బస చేసి, శుక్రవారం ఉదయం సుప్రభాత సేవలో, విఐపి విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకోనున్నారు..

గడపగడపలో కనుగొన్న సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- నగరి: జగనన్న పాలనలో సంక్షేమానికి అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. నగరి మున్సిపాలిటీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో 2వ వార్డు కాకవేడులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, 3వవార్డు ఏకెఎన్ లేఅవుట్లో రూ.15లక్షల వ్యయంతోను, 8వ వార్డు కీళపట్టు బీసీ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతోను నిర్మించే సిమెంట్ రోడ్డు పనులకు గురువారం ఆమె భూమి పూజ చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను ఆ పథకానికి సంబంధిత నిధులతో పరిష్కరించడం జరుగుతోందన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ



ప్రజాశక్తి-బాలయ్యపల్లి: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రైతులకు 80శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ మల్లిమల గోపికృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్బికే వద్ద వరి నారుమట్లు దెబ్బతిన్న రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ రూ.39గాను రాయితీ పోను రూ.7కేజీ అందిస్తున్నట్లు వివరించారు. ఏవో శిరీష, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

లక్ష్యం బలంగా వుంటే అన్నీ సుసాధ్యమే


ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: విద్యార్థులు తమ లక్ష్యం బలంగా వుంటే అన్ని సుసాధ్యమేనని చిన్నగొట్టిగల్లు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, తిరుపతి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి ఎమ్. విశ్వనాథ నాయక్ విద్యార్థులకు సూచించారు. ఇటీవల కళాశాలలో విద్యార్థుల మధ్య జరిగిన స్వల్ప ఘర్షణల నేపథ్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కళాశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను కాలేజీకు పంపితే సరిపోదని వారిని కనిపెట్టుకొని నిఘా వుంచి వారిని మంచి మార్గంలో పెట్టాలని సూచించారు. దగ్గరలో పరీక్షలున్నందున పిల్లలను సెల్ ఫోన్లకు దూరం పెట్టాలన్నారు. ఇంటి దగ్గర చదివే విధంగా చూడాలన్నారు. తల్లిదండ్రులు అప్పుడప్పుడు కాలేజీకి వచ్చి లెక్చరర్ లను కలిసి పిల్లల ప్రగతి,హాజరు, తది తరాలపై సమీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు నాగరాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అండర్ 16 విభాగంలో 2 కి.మీ లలో ప్రథమ స్థానంలో హిందూ(శివశరణి) ద్వితీయ స్థానంలో భావన 7వ తరగతి విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు అర్హత సాధించారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. కేశవుల నాయుడు తెలిపారు. ఈ నెల 24న సామర్లకోట వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలలో పాల్గొంటారన్నారు. మంచి ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయిలో ఆడడానికి అర్హత సాధించిన విద్యార్థినులను పాఠశాల పీడీలు రామకృష్ణ, సాంబశివరావు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

శ్రీరామలో జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఎలక్ట్రికల్ విభాగం, జాతీయ సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కరకంబాడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగాధిపతి బి. ఏ.మురళీశంకర్ విద్యార్థులకు మన చుట్టూ వున్న వనరులను భావితరాలకు చేరేలా ఎలా కాపాడుకోవాలన్న అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర సహకారంతో ఉపయుక్త కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: కెఆర్ బాలాజీ




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా తగిన శిక్షణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని హోటల్ భీమా రెసిడెన్సి చైర్మన్ కె.ఆర్ బాలాజీ తెలిపారు. గురువారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని నవభారత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక చైతన్యవంతులుగా ఎదగాలంటే ఎంచుకున్న రంగంలో స్వీయ నైపుణ్యం సాధించాలన్నారు. నవ భారత్ సేవా సమాజ్ సంస్థ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్ శిక్షణకు అవసరమైన సామాగ్రిని అందజేసి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జన్ శిక్షణ సంస్థాన్ శాఖ నుండి సర్టిఫికేట్ రుణం పొందేందుకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ శాఖ అధికారి డా.సుధాకర్, నవ భారత్ సేవా సమాజ్ సిబ్బంది ఎ.సురేఖ, అఫ్సర్ బాను, అమీన్ తాజ్, సుమలత, లావణ్య, టైలరింగ్ శిక్షణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పథకం ద్వారా దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు అందిస్తోంది. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో 15 విద్యార్థులకు పీహెచ్సీ డాక్టర్ చైతన్య అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది లలిత్కుమార్, గోపికిరణ్, సుమతి, మౌనిక, సుధాకర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ ఉండాలి

- అసాంఘిక శక్తులను కట్టడి చేయండి
- దేవాలయాల వద్ద భద్రత పెంచండి
- రహదారుల్లో నిఘా పెంచండి
- పుత్తూరు పోలీసులకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి సూచన



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: క్షేత్ర స్థాయిలో విజిబుల్ పోలీసింగ్ తప్పని సరిగా కనిపించాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి పోలీసులకు దిశానిర్దేశం చేశారు. గురువారం పుత్తూరు సబ్ డివిజన్ కార్యాలయంతో పాటు వడమాలపేట, పుత్తూరు రూరల్ సర్కిల్ కార్యాలయం, నారాయణవనం స్టేషన్లలో ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతికి సంబంధించి వివరాలను ఆరాతీశారు. పెండింగ్ కేసులు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో గ్యాంబ్లింగ్, గంజా, నాటుసారా వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అసాంఘిక శక్తులను ఎక్కడికక్కడ కట్టడి చేయాలన్నారు. రహదారుల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. రాత్రిల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. పర్యాటక, దేవాలయాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వస్తున్న బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. న్యాయం కోసం వచ్చిన వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. స్టేషన్కు వచ్చిన ప్రతి ఫిర్యాదికి స్పష్టమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. విధుల్లో క్రమశిక్షణగా మెలగాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస రావు, శిక్షణా డిఎస్పి సింధు ప్రియ, సీఐలు చంద్రశేఖర్ పిళ్ళై, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ పరమేశ్వర నాయక్, రామాంజినేయులు సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాధునిక సొబగులతో సచివాలయాలు : ఎమ్మెల్సీ



ప్రజాశక్తి-చిట్టమూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను అత్యాధునిక సొబగులతో తీర్చిదిదుత్తోందని ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. గురువారం మండలంలోని యాకసిరిలో సచివాలయం, ఆర్బికె భవనాలను ఆయన ప్రారంభించారు. సచివాలయ భవన స్థలం సమకూర్చిన ఉప సర్పంచ్ గంజి సుబ్రమణ్య ప్రసాద్ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి సుబ్బులమ్మ, మండల అధ్యక్షులు సన్నారెడ్డి విజయలక్ష్మి, జడ్పిటిసి చిప్పల వెంకటయ్య, నాయకులు శ్రీనివాసులురెడ్డి, మాజీ జెడ్పిటిసి రమణయ్య, అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టి కాలనీ, రాజుల పాలెం ఎస్టీ కాలనీలోని తుఫాన్ బాధితులకు అమెజాన్- డొనేట్ కార్డ్ సౌకర్యంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం బియ్యం, పది రకాల నిత్యవసర సరుకులు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు మాట్లాడుతూ మొదట నుంచి గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తుఫాన్ విపత్తు సమయంలో గిరిజనులకు సేవ చేసే అవకాశం కల్పించిన అమెజాన్- డొనేట్ కార్డ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 130 కుటుంబాలకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, చిందేపల్లి సర్పంచ్ పెంచలయ్య, ఈశ్వరయ్య, రాజుల పాలెం మాజీ సర్పంచ్ గురవయ్య, ఆషా సిబ్బంది, శ్రీనివాసులు, బాలరాజు, వలంటరీ అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనవరి 7వ తేదీ విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రం వేదికగా జరిగే గిరిజనుల శంఖారావం సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాపాడుతూ, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ ప్రతి గిరిజనుడికి అందాలంటే ఇటువంటి సభల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మరింత ఐక్యమత్యంతో గిరిజనులందరూ సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని అన్నారు. గిరిజన మహిళ రాష్ట్ర నాయకురాలు నాగరాణి, సభ్యులు మంజుకుమార్, నీలే, ఈశ్వర్, చిన్నమ్మ, బాపూజీ, గిరిధర్, శ్యామల పాల్గొన్నారు.

దూర విద్యా విధానంలో ప్రయోజనాలు అనేకం: వీసీ



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు, అభ్యర్థులు చదువు మధ్యలో నిలివేసి రెగ్యులర్ కోర్స్ చదవలేని వారికి దూరవిద్య విధానంలో కోర్సులు పూర్తి చేయడం ఎంతో సులభం అని, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అది కొద్ది కాలంలోనే తరగతులు హాజరై సబ్జెక్టుపై పూర్తి పరిజ్ఞానం పెంచుకోవచ్చని, దీని ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.భారతి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ మెటీరియల్స్ దూరవిద్య, ఆన్లైన్ లర్నింగ్ అనే అంశంపై మూడు రోజుల వర్క్షాప్ గురువారం సావేరి అతిథి గృహంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎం.అరుణ, డాక్టర్ సి.ఆర్.కె మూర్తి పాల్గొన్నారు.

ఆటలపోటీలకు దరఖాస్తులు



ప్రజాశక్తి-ఏర్పేడు: ప్రభుత్వం నిర్వహించబోతున్న ఆడుదాం ఆంధ్రా ఆటపోటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఎండి పుత్తూరు సర్పంచ్ మోహన్ ప్రియ అన్నారు. గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ అధిక సంఖ్యలో యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి లోకముని పాల్గొన్నారు.

బియ్యం బొక్కేశారు.. నగదు నొక్కేశారు



సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

- ప్రభుత్వ సాయం అందించడంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని ఆరోపణ
- ఆర్డీవో గారూ.. మీరైనా చెప్పండి సారూ అంటూ నినాదాలు
- సచివాలయం వద్ద తుపాను బాధిత కుటుంబాల ఆందోళన

ఊహించని తుపాను ముంచుకొచ్చి ఊళ్లన్నీ అస్తవ్యస్థమైన పరిస్థితి. పంటలు, ఇళ్లు నీట మునిగిన ఆ గ్రామాల్లో అపార నష్టాన్ని మిగిల్చాయి. ఆపన్నహస్తం కోసం రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో బాధితులకు సాయంగా ప్రభుత్వం బియ్యం, రూ.2500 ప్రకటించింది. అంతవరకూ బాగానే ఉన్నా.. బాధితలకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వ సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో ఆ గ్రామస్తులు ఆందోళనకు దారి తీసింది.

- ప్రజాశక్తి-గూడూరురూరల్

తుపాను బాధిత కుటుంబాలకు అందిస్తున్న ప్రభుత్వ సాయాన్ని సిబ్బంది పక్కదారిపట్టించారని మండలంలోని విందూరు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గురువారం స్థానిక సచివాలయం వద్దకు చేరుకొని సిబ్బందిపై మండిపడ్డారు. తమకు చెందాల్సిన పరిహారాన్ని ఎందుకు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత సమయం సిబ్బందికి బాధితులకు వాదోపవాదాలు జరిగాయి. అక్కడ సరైన సమాచారం రాకపోవడంతో అక్కడే నిరసనకు దిగారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సాయంగా ప్రభుత్వం 25కిలోల బియ్యం, రూ.2500 నగదు ప్రకటించినా.. తమకు అందివ్వకుండా పక్కదారిపట్టించారని ఆరోపించారు. కొందరికి మాత్రమే సాయం అందించి తమకు ఇవ్వకపోవడం సోచనీయం అన్నారు. స్థానిక ఆర్డీవో స్పందించి ప్రభుత్వ సాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జాతీయ సమైక్యత దేశాభివృద్ధికి మొదటి సోపానం : డాక్టర్ టి. చైతన్య



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ యూనివర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం, ఎస్వీయూ బిసిడిఈ, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి గ్రామీణ తుమ్మలగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ సమైక్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉమెన్ స్టడీస్ సెంటర్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టి. చైతన్య మాట్లాడుతూ భారతదేశం లౌకిక రాజ్యమని ఎన్నో మతాలు, కులాలు, భాషలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యత కోసం విద్యార్థి దశ నుంచే పోరాడాలని తల్లిదండ్రులను పెద్దలను గౌరవించాలని దేశం పట్ల భక్తి విశ్వాసం కలిగి ఉండాలన్నారు. యోగ, ధ్యానం లాంటివి అలవాటు చేసుకుని ఏకాగ్రతతో చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు, డాక్టర్ సునీత, హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్: తుపాను బాధితులకు అధికారులు నగదు సాయాన్ని అందజేశారు. గురువారం మండల వైసీపీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పెట్లూరు యాతలూరు సచివాలయాల పరిధిలో మొగళ్ళుగుంట ఎస్టీ కాలనీ, గొట్లగుంట ఎస్టి కాలనీ, పంజాం ఎస్ టి కాలనీ, కంపల్లి ఎస్సీ కాలనీ, కుమ్మరమిట్ట లోని వరద బాధితులకు నగదును అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ పద్మావతి, వీఆర్వో వాసు, మండల వైస్ ప్రెసిడెంట్ వీరి పెంచలయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ప్రజాశక్తి-క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండో విడత అంతర కళాశాలల క్రీడలు ఆటలు, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం 2023-24లో మూడో రోజులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలైన సోలో డాన్స్, క్లాసికల్ డాన్స్ ఫోక్ డాన్స్ వంటి కార్యక్రమాలలో క్రియేటివ్ ఆర్ట్స్ లో భాగంగా విద్యార్థులకు పలు పోటీ కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం రేపు ఉదయం ఈ క్రీడోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నందు ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారదా జయలక్ష్మిదేవి విచ్చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఆశా వర్కర్ల ధర్నా



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ వెనువెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి జిల్లా 36 గంటల వంట వరకు ధర్నా కార్యక్రమం తిరుపతి జిల్లా వైద్య అధికారి ఆఫీసు ముందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షుడు జీ.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆశా కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వము వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేదాకా పోరాడు తామన్నారు. కార్యక్రమంలో పాల లక్ష్మి, సుజాత, మంజుల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్: ప్రజాప్రతినిధుల పట్ల అధికారులకు నిర్లక్ష్యం తగదని వైస్ ఎంపీపీ సుధాకర్ అన్నారు. తుపాను బాధితులకు నేరుగా అధికారులే వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందించడాన్ని తప్పుబట్టారు. ఎంపీపీకి, తమకు తెలియకుండా అధికారులు నేరుగా వెళ్లి ఇవ్వడంతో, గ్రామాల్లోని లోపాలను ఎవరు సరిచేస్తారని మండిపడ్డారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. తహశీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, రాజేంద్ర, కుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నగదు చోరీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: మోటారుబైక్లోని నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించిన సంఘటన గురువారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. బద్వేలు గ్రామానికి చెందిన రైతు వేదం శ్రీహరిరెడ్డి వ్యవసాయ పనులకు అవసమని గురువారం గూడూరు పట్టణంలోని బ్యాంకులో రూ.2.50లక్షల నగదు విత్ డ్రా చేసుకొన్నాడు. తిరుగు ప్రయాణంలో టీ సెంటర్ వద్ద ఆపి టీ త్రాగుతుండగా గుర్తు తెలియని దుండగులు నగదును అపహరించారు. దీంతో రైతు కన్నీరుమున్నీరయ్యారు. వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



ప్రజాశక్తి-క్యాంపస్: వైసీపీకి చెందిన పలువురు నేతలు గురువారం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం, శ్రీనగర్ కాలనీలో పులివర్తి నాని ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు నాని దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గాంధీపురంకు చెందిన 30 కుటుంబాలు పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రామచంద్రాపురం: మండలంలోని వెంకటరామాపురం మాజీ ఎంపీపీ, ఆరి దొరస్వామినాయుడు బుధవారం మృతి చెందారు. ఆయన పార్థవదేహానికి నివాళులర్పించి, గురువారం జరిగిన అంతిమయాత్రలో పులివర్తి నాని పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, మధుసూదన్ రెడ్డి, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి'

ప్రజాశక్తి-రేణిగుంట: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ఛార్జ్ బొజ్జల సుధీర్రెడ్డి అన్నారు. గురువారం రేణిగుంట పట్టణంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, పుష్పనాధన్, బుజ్జి నాయుడు, కన్నన్రెడ్డి, నవాబ్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత తులసి రెడ్డి



మాట్లాడుతున్న తులసి రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని కాంగ్రెస్ సీనియర్ నేత తులసి రెడ్డి అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ నేడు 10 లక్షల మంది రోడ్లపైకి వస్తూ కన్నీరు పెట్టుకుంటున్నారని, మహిళల కన్నీటితో జగన్ సర్కార్ వచ్చే ఎన్నికల్లో కుప్ప కూలిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీ మేరకు రూ.18వేలు జీతం పెంచారన్నారు. అంగన్వాడి వర్కర్ల బాధ్యతలను వేరొకరికి బదలాయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పార్లమెంటుకు 5 అంచల భద్రత ఉన్న హాలు లోకి పొగ బాంబులతో అగంతకులు ఎలా వెళ్లగలిగారని, దీన్ని బట్టి చూస్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందని తేట తెల్లమవుతుందన్నారు. దేశ అత్యున్నత చట్టసభగ పేరుగాం చిన పార్లమెంటు భవనానికి రక్షణ లేకపోతే దేశ ప్రజల రక్షణ, దేశ సరిహద్దులను ఎలా కాపాడుతారో ప్రశ్నార్థకంగా మారు తోందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టడం కడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత లు ప్రమీలమ్మ, వెంకటనరసింహులు, సోమశేఖర్ రెడ్డి, రమేష్, రామచంద్రారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామచంద్రయ్య, అనిల్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి


- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ద్వారా నిర్మించిన వంటగది, తాగునీరు కులాయిలను ఆయన ప్రారంభించారు. మద్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. భోజనంలో రుచిగా ఉందని అక్కడి సిబ్బందికి కితాబు ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రమ ణ్యం, పాఠశాల ఇన్ఛార్జ్ హెచ్ఎం నాదెండ్ల మురళి, ఉపాధ్యాయులు యువశ్రీ, మురళి, ఒబ్బుప్రసాద్, వేణు గోపాల్, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాధం పాల్గొన్నారు.

బాలిక మృతికి నివాళి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రూరల్ మండలంలోని పరమేశ్వర మంగళ వద్ద జివిఆర్ కన్వెన్షన్ హాల్ నందు బుధవారం పెళ్లి మండపంలో సిలిండర్ పేలి బాలిక చాందిని మృతి చెందింది. గురువారం మంత్రి రోజా సో దరుడు రాంప్రసాద్రెడ్డి బాలిక మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదా ర్చారు. ఆయన వెంట వైసీపీ నాయకులు సుదర్శనం ఉన్నారు.

పాఠశాల భవనానికి భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని వికృతమాల గ్రామంలో శ్రీ స్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠం నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీ స్వామినారాయణ గురుకుల్ ట్రస్ట్ వారి ఇంటర్నేషనల్ స్కూల్ రావడం పిల్లల అదృష్టమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన స్వామీజీ మహంతు సాదు, దేవ ప్రసాద్ దాస్, సాదు నిత్య స్వరూప దాస్, సాధు శుక్ల వల్లభ దాస్, సాధు నిత్య స్వరూప దాస్, కిషోర్ రెడ్డి, కోనాటి రమణయ్య యాదవ్, లక్కమనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధిగా దేవికా చౌదరి



ప్రజాశక్తి-వెంకటగిరి: వైసీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధిగా దేవికా చౌదరి నియమితులైయ్యారు. గురువారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్నా తమకు గుర్తింపు లేదని, వైసీపీలో చేరగానే తగిన పదవి ఇచ్చి గౌరవించారని సీఎం జగన్మోహన్రెడ్డికి, వెంకటగిరి సమన్వయకర్త రాంకుమార్రెడ్డికి కృతఘ్నతలు తెలిపారు. నమ్మకంతో తనపై పదవీ బాధ్యతలు అప్పగించినందుకు శక్తి వంచన లేకుండా కష్టపడతానని స్పష్టం చేశారు. నాయకులు చెల్లికం శంకర్ రెడ్డి, ఎల్ కోటేశ్వరరావు ఉన్నారు.